# మానవత్వం మరణించదు



ఇంటర్వ్యూకు సూటుకేసుతో వెళ్ళిన చక్రవర్తి రిక్తహస్తాలతో, దిగాలుపడిన మొహంతో రూములోకి అడుగు పెట్టడం మిత్రుడు సత్యమూర్తికి ఆశ్చర్యం కల్గించింది. ఎన్నో ఆశలతో మనో ధైర్యంతో, సంతోషంగా వెళ్లినవాడు, దైన్యంగా మౌనంగా తిరిగి రాడానికి ఏదో బలీయమైన కారణం ఉండి ఉండాలి అనుకొన్నాడు.

నిట్టూర్చుతూ కూలబడ్డాడు చక్రవర్తి చాపమీద.

'ఏమైంది? ఏమిటీ అవతారం?' సత్యమూర్తి అడిగాడు.

సత్యమూర్తి కన్నుల్లోకి చూస్తూ, బీదగా నవ్వి 'దరిద్రుడి పెళ్ళికి వడగళ్ళవాన అన్నట్లుగా దురదృష్టవంతుడి ప్రయత్నానికి అన్నీ కడగళ్ళేరా!' అన్నాడు తలక్రింద చేతులు పెట్టుకొని పండుకొంటూ.

'డొంకతిరుగుడు లేకుండా, సరిగ్గా చెప్పి ఏడవ్వగదా నువ్వు' విసుక్కొంటూ అన్నాడు సత్యమూర్తి.

'జీవితమే డొంకతిరుగుడు వ్యవహారమైనప్పుడు నేను ఇంతకంటే ఇంకో విధంగా ఎట్లా మాట్లాడను ?'

'ఈసారి కూడా డిజప్పాయింట్మెంట్ పునరావృతం అయ్యిందా ?'

'ఇక డిజప్పాయింట్మెంట్ పునరావృతంకాని అదృష్టం జరిగిపోయిందిలే !'

'అంటే !?' ముఖంలోకి చూస్తూ అడిగాడు మూర్తి.

'ఇంటర్వ్యూకు వెళ్ళకముందే సిటీబస్లో సూటుకేసు ఎవరో కొట్టేశారు. రెండొందలు దాన్లోనే ఉంచాను. సర్టిఫికెట్స్ అన్నీ ఎలాగూ దాన్లోనే ఉన్నాయి. జేబులోవున్న డబ్బుతో తిరిగి రూమ్కు చేరాను. దునియా గోల్ హై. ఇక నన్నేమీ అడగొద్దు' అని అటు తిరిగి పండుకొన్నాడు చక్రవర్తి.

సత్యమూర్తి తలపై నాటుబాంబు విసిరేసినంత షాకు తిన్నాడు. డబ్బు పోతేపోయింది. అప్పో, సప్పో చేసి, కాళ్ళా వేళ్ళాపడి, జబర్ దస్తీగానో, దొరతనంగానో చివరకు దొంగతనంగానైనా సంపాదించ వచ్చు డబ్బు! పోయిన సర్టిఫికేట్లు సంపాదించాలంటే మాటలా ? ఎంతో అన్యాయం జరిగిపోయింది! ఇప్పుడు ఎట్లా ? ఏం చేయాలి ? చక్రవర్తి అసలే ఉద్రేకం మనిషి ! ఏ మౌతాడు ? ఎన్నో ఆలోచనలు సాగర తరంగాల్లా సత్యమూర్తి తలలో కొట్టుమిట్టాడు తున్నాయి.

కిటికీలోంచి వచ్చిన గాలికి కేలండర్ రెప రెపమన్నది. కేలండర్లోని యువతి పకాలున నవ్వుతున్నట్లున్నది. బ్రహ్మచారుల రూముల్లో ఉండేది అర్ధనగ్నపు అమ్మాయిల బొమ్మలు, నవ్వుతున్న సుందరాంగుల చిత్రాలు, ఉంటే గింటే రకరకాల పూల చిత్తరువులు !

సత్యమూర్తి కేలండర్ బొమ్మలన్నిటి వైపు చూశాడు. క్రింద నిరాశగా పడుకొన్న మిత్రుడు చక్రవర్తి వైపు చూశాడు.

జి.భాను

ఉద్యోగం దొరికితే, జీవితంలో స్థిరపడి, అందాల సుందరి మలిచెవ్వని కౌగిలిలో, నవ్వే పువ్వుల లోకంలో విహరించాలనే, తన్మయం చెందాలని ప్రతి యువకుడు ఉవ్విళ్ళూరుతాడు! ఎన్నో కలలు, కల్పనలు అల్లుకొంటాడు! జీవితాన్ని రంగు రంగుల భావాలతో రూపు దిద్దుకొంటాడు!

ఒకవేళ తన మధురోహల లోకానికి ద్వారాలు మూసుకొనిపోయి, ప్రవేశమే దుర్లభమైతే, అభిలాషలు ఎండమావులైతే, నిరాశల విజృంభణతో ఆ యువకుడు ఏమౌతాడు? జంతువు అవుతాడో? ఉన్మాదే అవుతాడో? సినిక్ అవుతాడో?

లోకంతో రాజీపడలేక అరణ్యాల్లోకే వెళ్తాడో? లోకంలో అరణ్య సిద్ధాంతాల్నే స్థాపిస్తాడో? తన తలలో అరణ్యాల్ని సృష్టించుకొంటాడో? ఏమైనా కావచ్చు!

సత్యమూర్తి కన్నుల్లో నీటి తెరలు కదిలాయి.

కళాశాలలో ఐదేళ్ళు చదివి పాసయినవాడు, తన పొట్ట గడుపుకొని, తమకింత పెట్టకపోడు. తమ్ముణ్ణి చూస్తాడు; చెల్లెలి పెళ్ళిచేస్తాడు అనుకొని ఏదోవిధంగా తినో తినకో, లొకట్టుపెట్టి డబ్బు పంపుతున్నారు చక్రవర్తి తల్లిదండ్రులు.

ఇప్పుడు వాళ్ళ శ్రమ, ఆశలు వమ్మైయ్యాయని తెలిస్తే ఆ తల్లిదండ్రుల పరిస్థితి ఎలా ఉంటుంది?

ఒక ప్రయివేటు కంపెనీలో క్లర్కుగా పని చేస్తూ, చక్రవర్తి మనస్తత్వం, అతని కుటుంబం స్తోమత తెలిసిన సత్యమూర్తి ఈ విధంగా ఆలోచించడం సముచితమే! రెండు సంవత్సరాలుగా ఒకే గదిలో ఉంటూ ఒకరి అభిప్రాయాలు ఒకరు అర్థం చేసుకొని జీవిస్తూ, ఒకరికి కష్టం సంప్రాప్తించినప్పుడు కలవర పడడంలో ఆశ్చర్యమేమీకాదు.

ఆ తర్వాత రెండు రోజులు చక్రవర్తి చక్రంలాగా గస్తీ తిరిగాడు. సినిమాహాళ్ళ దగ్గర బ్లాక్ టిక్కెట్లు అమ్మేవాళ్ళని, బస్సు స్టాండుల దగ్గర పిక్‌పాకెట్‌గాళ్ళను, రైల్వేస్టేషన్ల దగ్గర సీట్లు అమ్మేవాళ్ళను, దొంగతనం చేయడానికి పొంచి ఉన్నవాళ్ళను, కిరాయికి ఎటువంటి పనైనా చేయడానికి సిద్ధపడి ఉన్నవాళ్ళను చూశాడు.

ఆకలి సముద్రం ఈదడానికి అంతులేని ఉపాయాలు అన్వేషించే ఆవారాగాళ్ళను చూశాడు.

ఈ దశ అవతారాల్లో ఏ అవతారం ఎత్తాలో తాను? చక్రవర్తి మనస్సు సమస్యల చక్రభ్రమణం అయ్యింది.

మూడో రోజున చక్రవర్తికి రెండు ఉత్తరాలు వచ్చాయి. ఒకటి ఇంటి దగ్గరనుండి, రెండోది విజయవాడ నుండి.

సాయంత్రం ఆఫీసునుంచి వచ్చిన సత్యమూర్తి, చింపని ఉత్తరాన్ని చూసి చక్రవర్తి లేడనుకొని విజయవాడ నుంచి వచ్చిన ఉత్తరాన్ని చింపి, చదివి ఈలవేశాడు. అందులో ఉన్నది రెండే పంక్తులు!

బ్రదర్ చక్రవర్తి!

నువ్వు పోగొట్టుకొన్న సూటుకేస్‌ను బీసెంటు రోడ్డు సెంటరులో ఉన్న హోటల్ సిద్ధార్థ రూము నెం. 9 లో తీసుకోవలసింది. ఈఉత్తరాన్ని



చూపిస్తే అక్కడున్న వ్యక్తి సూటుకేసును అందజేస్తాడు. వివరాలు సూటికేసులో

ఇట్లు,
శ్రేయోభిలాషి.

ఎప్పుడో రాత్రి పది గంటలకు కాళ్ళీడ్చుకుంటూ వచ్చిన చక్రవర్తికి ఎదురు చూస్తున్న సత్యమూర్తి ముందుగా ఇంటి దగ్గర నుంచి వచ్చిన ఉత్తరాన్ని ఇచ్చాడు. చక్రవర్తి చించి, చదివితే ఇంటర్వ్యూ విశేషాలు వ్రాయవలసిందిగా కోరుతూ తండ్రి రాయించిన ఉత్తరం అది.

కళ్ళు మూసుకొని నిట్టూర్చాడు చక్రవర్తి.

తర్వాత చించిన రెండో ఉత్తరాన్ని అందించాడు సత్యమూర్తి. రెండు క్షణాల్లో చదివి, ఎగిరిగంతేసి, సత్యమూర్తిని వాటేసుకొని, ఆనందంతో తబ్బిబ్బయిపోయాడు చక్రవర్తి.

'ఒరే చక్రవర్తి! ఇది ఊహించని విచిత్ర విషయం. నీ బ్రతుకు ఏ వెలుగుకోసం, భవిష్యత్తు కోసం ఉన్నదో మరి! కాకపోతే పోయిన సూట్‌కేసు ఉన్నదనీ, తీసుకొని పోవల్సిందిగా వార్త రావడం ఎంతో అదృష్టమనాలి. ఇంకా నువ్వు నిరాశ, నిస్పృహ పడనక్కరలేదు. నువ్వు ఏ విధంగానూ దురదృష్టవంతుడువి కాదురా. ఎందుకంటే ఈ రోజే అనుకోని విధంగా నాకు ఆఫీసులో నూటయాభై రూపాయలు అరియర్స్ అందాయి. ఇది విశేషం కాదా? ఈ వందరూపాయలు తీసుకెళ్ళి నీ సూటుకేసు తెచ్చుకో. తర్వాత మన ప్రయత్నాలు మనం చేసుకోడానికి వీలు అవుతుంది' అంటూ వందరూపాయలు ఇచ్చి, 'ఇంకో గంటలో బస్సుంది బయలుదేరు' అన్నాడు సత్యమూర్తి.

చక్రవర్తి సత్యమూర్తి కన్నుల్లోకి చూసి కన్నులు తుడుచుకొన్నాడు.

మరుసటి రోజు చక్రవర్తి బస్సుదిగి రిక్షాలో సిద్ధార్థ హోటల్‌కు వెళ్ళి, తొమ్మిదో నెంబరు గదిలో ఉన్న వ్యక్తికి తనకు వచ్చిన ఉత్తరాన్ని చూపించాడు.

ఓ మధ్య వయస్సున్న వ్యక్తి ఆ ఉత్తరాన్ని తీసుకొని చూసి 'ఓ! మీరేనా చక్రవర్తి?' అన్నాడు.

తల ఆడించాడు చక్రవర్తి.

మరుక్షణంలో చక్రవర్తి చేతిలోకి సూటుకేసు వచ్చింది. ఓ నిధిని పట్టుకొన్నంత పదిలంగా సూటుకేసును పట్టుకొని తిరుగు ముఖం పట్టాడు

స్టేషన్‌కు వెళ్ళి, ఇంకా కొద్ది సమయం ఉన్న బండి కోసం సిమెంటు బెంచిమీద కాసుకొని కూర్చున్నాడు. అప్పుడు చక్రవర్తికి తన సర్టిఫికెట్లు చూచుకోవాలనే బుద్ధి పుట్టింది. తెరచాడు. జత బట్టలు, టవలు, సోపు, పౌడర్‌టిన్ పెట్టినట్లే ఉన్నవి. సర్టిఫికెట్లు తాను సర్దిన క్రమంలోనే ఉన్నవి. కాకపోతే అడుగున పెట్టిన డబ్బు మాత్రం లేదు. నవ్వుకొన్నాడు చక్రవర్తి. సర్టిఫికేట్లు చేతిలోకి తీసుకొన్నాడు. ఎంతో తృప్తిగా కన్నులు మూసుకొన్నాడు. సూటుకేసు మరలా అందజేసిన అపరిచిత వ్యక్తికి అభినందనలు సమర్పించుకొన్నాడు.

ఆ సర్టిఫికేట్లు జీవిత గమ్యం చేరడానికి సోపానాలు!

లేకపోతే ఎన్ని మెట్లు జారిపోవలసి వచ్చేదో!

సర్టిఫికేట్లు అన్నీ ఒక్కసారి తిప్పాడు. మధ్యలో ఒక ఉత్తరం కన్పించింది. చేతిలోకి తీసుకొన్నాడు

తమ్ముడూ చక్రవర్తీ!

నీ సర్టిఫికేట్లులో ఉన్న పుట్టిన తేదీ ప్రకారం నాకంటే చిన్నవాడివి కాబట్టి ఈ సంబోధన. నీకు ఇబ్బంది కల్గించినందుకు కొంచెం కించపడుతున్నాను. సానుభూతి నా వృత్తికి వ్యతిరేకం కదా! లేడి కంటి నీరుచూసి బోయవాడు కరిగిపోతాడా? అయినా వెధవది ఒక్కోసారి మనస్సు మందలిస్తుంది! కాబట్టే ఈ ఉత్తరం.

ఈపాటికి ఇంటర్వ్యూకు వెళ్ళేవాడివి. బహుశా సెలెక్టెడ్ లిస్టులో ఉండేవాడివి, నీకున్న మార్కుల్ని బట్టే సుమా! ఉత్తర దక్షిణాల సత్తా నీకుందో లేదో నాకు తెలియదు. లోకంలో ఏది సజావుగా సాగుతున్నదో చెప్పు; నీ సూటుకేసును నేను కొట్టేసినట్లు. అన్నట్లు డబ్బు రెండు వందలు మినహా నీ సూటుకేసులో అన్నీ భద్రం!

అయితే ఈ సూటుకేసు మరల ఎందుకు



'స్వర్ణ కమలాలు' కథల సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్న సందర్భంగా ఢిల్లీ ఆంధ్ర వనితా మండలి వారు శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవిని ఇటీవల సన్మానించారు. మండలి అధ్యక్షురాలు శ్రీమతి పెండేకంటి కనకమ్మ వెంకట సుబ్బయ్య శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవికి మొమెంటోని అందజేస్తున్న దృశ్యం.

అందించాను ? మనసులో అనుకొంటున్నావు గదూ? ఐ విల్ కమ్ టు దట్ పాయింట్.

నేను వృత్తిచేత దొంగని కాని ప్రవృత్తిచేత కాదు. నేను కూడా స్వోత్కర్ష చెప్పుకోడం బాగో లేదు కదూ ? నాకు ఎలా రాయాలో అర్థం కావడం లేదు. జేబులు కత్తిరించడం అలవాటు అయ్యాం తర్వాత, రాసే అలవాటు తప్పిపోయింది.

ఒక సంఘటనగా రాస్తాను.

ఈ సంఘటన పదిహేను సంవత్సరాల క్రిందట జరిగింది. ఓ యువకుడు మద్రాసులోని ఒక ప్రయివేటు కంపెనీలో ఉద్యోగానికి ఇంటర్వ్యూకు వెళ్ళాడు. ఆ ప్రదేశం కొత్త. తెలుగుదేశం నుండి వెళ్ళిన వాడికి భాష క్రొత్త ! వాతావరణం క్రొత్త! సిటీబస్సులో ఎక్కి, దిక్కులు చూస్తూ, దిగవలసిన చోట దిగేటప్పటికి సూటుకేసు గల్లంతైంది.

నెత్తి నోరు మొత్తుకొన్నా నిష్ప్రయోజనమై పోయింది. దాన్లో డబ్బు లేదుగాని సర్టిఫికేట్సు అన్నీ ఉండిపోయాయి. ఇంటర్వ్యూ బోర్డువాళ్ళకి జరిగిన విషయం మొరపెట్టుకొంటే 'గెట్ అవుట్' అన్నారు. ఖచ్చితంగా దొరికే ఉద్యోగం ఎవడో కేడీ మూలంగా రాకుండాపోయింది. ఉద్యోగార్హతే జీవితంలో తుడిచి పెట్టుకొనిపోయింది.

కాయకష్టం అందరికీ చేతకాదు. సులువుగా డబ్బు గుంజే పద్ధతికే ప్రతివాడూ ఆకర్షింప బడతాడు. ఈనాడూ ఏదో విధంగా డబ్బు ఆర్జించే మహానుభావులు మన కళ్ళ ఎదుటే ఎందరు లేరు ? ఆ యువకుడూ అంతే !

## మానవత్వం మరణించదు !

ఉద్యోగం రాదు. కడుపులో ఆకలి ఆరదు. చెయ్యి చాచడం ఆత్మగౌరవానికి హాని. ఎవడో వివేకంలేని పశువు మూలంగా అతనికి దురవస్థ కలిగింది. కాబట్టి మనుషులమీద కసిని, క్రౌర్యాన్ని, కార్పణ్యాన్ని పెంచుకొన్నాడు. మానవత్వాన్ని మంట కలిపాడు. ఆలోచనలకు స్వస్తి పలికేడు. వివేకానికి విడాకులిచ్చాడు. పిక్‌పాకెట్లు కొట్టడం, దొంగ తనం చేయడం వృత్తిగా మలచుకొన్నాడు. జనం కళ్ళలో కారంకొట్టి జీవితాన్ని వెళ్ళబుచ్చుకొస్తున్నాడు.

మొన్నీమధ్య ఒక విచిత్రమైన సంఘటన ఎదుర్కొన్నాడు. బస్సులో ఒక సూటుకేసు కొట్టేశాడు. డబ్బు తీసుకొన్నాడు. ఆదివరకు ఇటువంటి చౌర్యం చేసినా, ఇటువంటిది తటస్థించడం ఇది మొదటిసారి. ఈ సూటుకేసులోని సర్టిఫికెట్స్ చూడగానే అతని బుర్రలో అతని గత జీవితం గిర్రున తిరిగింది !

ఒకనాడు సర్టిఫికేట్స్ పోగొట్టుకొన్న కారణంగా జీవితంలో సవ్యమైన జీవనాన్ని పోగొట్టుకొని, ఒక విధమైన అర్థరహితమైన పరభాగ్యోప జీవిగా బ్రతుకు గడుపుతున్న అతనికి, సర్టిఫికేట్స్ తన చేతిలో పడటం మూలంగా, తనవంటి పరిస్థితే ఎదుర్కోబోయే ఒక యువకుడి గతి వెంటనే స్ఫురించింది. అతనిలోని మానవత్వం కన్నులు విప్పింది. నిరాశతో, గత్యంతరంలేక అతను ఏదో పొట్ట కోసం వక్ర జీవితాన్ని ఎన్నుకొంటే, ఇతను కూడా రేపు సమాజానికి చీడగా తయారైతే ఎలా ? అదీ తన మూలంగానా? అనే ప్రశ్నలు పడగలెత్తాయి.

మందలించిన మనస్సాక్షి సలహా మేరకు ఇంటర్వ్యూ కవరుమీదున్న అడ్రసు ప్రకారం ఒక ఉత్తరం రాసి ఆ కుర్రోణ్ణి సూటుకేసు తీసుకొనే ఏర్పాటు చేశాడు.

తమ్ముడూ ! కథ బాగానే వచ్చింది కదూ ! ఇక మామూలుగా నడిపిస్తా.

ఒకప్పుడు సూటుకేసు పోగొట్టుకొన్న దురదృష్టవంతుణ్ణి నేనే ! ఏమీ చేతగాక పరిస్థితుల ప్రభావంవల్ల కేడినైపోయాను. నువ్వు డబ్బున్న వాడివో, లేనివాడివో సరిగా తెలియదు. కానీ నా అవసరంకొద్ది డబ్బు తీసేసుకొన్నాను. కానీ నాకులాగా నువ్వు నిరర్థకమైన, తెగిన గాలిపటం జీవితాన్ని ఎంచుకొంటావేమోనన్న ఉద్దేశంతో నా వృత్తికి భిన్నంగా ఇట్లా చేశాను. ఒకప్పుడు శిలలో సంగీతం వినబడవచ్చు; చచ్చినట్లున్న మోడు చిగర్చనూవచ్చు. ఇది నీ మనసులోని సందేహానికి సమాధానం.

నీకు భవిష్యత్తులో మంచి ఉద్యోగం దొరికి, సుఖశాంతులతో, మానవత్వంతో మనుగడ సాగిస్తావని ఆశిస్తూ —

శ్రేయోభిలాషి.

అంతలోనే ప్లాటుఫారంమీదకు చక్రవర్తి ఎక్కవలసిన రైలుబండి ఆశలాగా వచ్చింది. ఉత్తరాన్ని ముద్దుపెట్టుకొని, సూటుకేసులో పెట్టి లేచాడు చక్రవర్తి బండి ఎక్కడానికి. ★




Sobhagya-KF/83/1